క్లుప్తంగా

సనాతన వాహిని ఆధ్వర్యంలో పోటీ పరీక్షలు



మాట్లాడుతున్న శ్రేయానంద మాతాజీ

రాజంపేట రూరల్ : స్వాతంత్ర్య సమరయోధుల గురించి సనాతన వాహిని సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. స్థానిక సాయి విద్యాలయ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన ఈ పోటీ పరీక్షలలో 20 పాఠశాల(ప్రభుత్వ, ప్రైవేటు)లకు చెందిన 177 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మండల పరిధిలోని ఈ 20 పాఠశాలలో 3400 మందికి గతంలో ఆయా పాఠశాలలో పోటీ పరీక్షలు జరిపారు. అందులో క్వాలీఫై అయిన 177 మంది విద్యార్థులకు ఆదివారం పరీక్షలు నిర్వహించగా, 21 మంది విద్యార్థులకు మొదటి 3 బహుమతులు కింద ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రేయానంద మాతాజీ విద్యార్థులకు ఉపదేశం అందించారు. కార్యక్రమంలో సనాతన వాహిని గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఎస్.బాలరాజు, అధ్యక్షులు డాక్టర్ శ్రీహరి, ఉపాధ్యక్షులు డాక్టర్ అనిల్‌కుమార్, కార్యదర్శి బి.పాండురంగరాజు, విశ్రాంత మిలిటరీ వైద్యులు ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్.చలమయ్య, సనాతన వాహిని కార్యవర్గ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిప్పాయిపల్లి వాసికి డాక్టరేట్



కొమ్మ పార్థసారథి

పుల్లంపేట : పుల్లంపేట మండలం తిప్పాయిపల్లి గ్రామానికి చెందిన కొమ్మ పార్థసారథికి ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో డాక్టరేట్ పొందారు. ప్రొఫెసర్ ఎం.శివశంకర్ రెడ్డి పర్యవేక్షణలో ఎస్వీ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. కొమ్మ పార్థసారథి జిల్లా పరిషత్ హైస్కూల్ వత్తలూరులో విధులు నిర్వర్తిస్తున్నారు.

నియామకం



సమావేశం అనంతరం కమిటీ సభ్యులతో సర్పంచ్ చిదంబరరెడ్డి

సంబేపల్లె : అఖిల భారత పంచాయతీ పరిషత్ వర్కింగ్ కమిటీ మెంబర్‌గా మండలంలోని గుట్టపల్లె సర్పంచ్ చిదంబరరెడ్డి నియామకం అయ్యినట్టు ఆయన ఇక్కడి విలేకరులకు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14న ఢిల్లీలో మయూర్ విహార్ న్యూఢిల్లీలో జరిగిన ఎన్నికల్లో తన నియామకం జరిగిందన్నారు. మొత్తం పది మంది సభ్యులుగా ఎన్నుకోగా ఆంధ్రప్రదేశ్ నుంచి తాను ఒక్కడినే సభ్యుడిగా ఉన్నట్టు పేర్కొన్నారు. దీంతో ఆయనకు పలువురు అభినందనలు తెలియజేశారు.


ఘనంగా ఆలయ వార్షికోత్సవ వేడుకలు



భక్తులకు దర్శనమిస్తున్న మహంకాళి

రాజంపేట రూరల్ : మండల పరిధిలోని వెంకటరాజంపేట గ్రామంలో ఆదివారం మహంకాళి తల్లి ఆలయ 10వ వార్షికోత్సవ వేడుకలను ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. వేకువజామునే అమ్మవారికి ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు, హోమాలు జరిపారు. అంతకుముందు మహంకాళి అమ్మవారిని శోభాయమానంగా అలంకరించారు. భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. మహిళలు పొంగళ్లు పొంగించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు.

ఏయూలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

రాజంపేట : అన్నమాచార్య యూనివర్సిటీలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు ప్రతి ఏడాది కలుసుకొని వారి తీపి గుర్తులను నెమరవేసుకుంటూ ఆనందంగా గడపడమే కాకుండా తిరిగి కళాశాలను సందర్శించడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. విశిష్ట అతిథి కె.ప్రదీప్ మాట్లాడుతూ అలమ్నిలో విద్యార్థులు అందరూ కుటుంబ సమేతంగా వచ్చి వారివారి అనుభూతులను తెలియజేస్తుండటం సంతోషంగా ఉందని చెప్పారు.

నిలువెత్తు నిర్లక్ష్యం!

- శిథిలావస్థకు చేరుకున్న ఓవర్ హెడ్ ట్యాంకులు
- నిర్వహణ భారంతో చేతులెత్తేసిన పంచాయతీలు
- ప్రభుత్వం నిధులు కేటాయించాలని విజ్ఞప్తి

రైల్వేకోడూరు అర్బన్ : ప్రజల తాగునీటి అవసరాల కోసం ఏర్పాటైన ఓవర్ హెడ్ ట్యాంకులు (ఉపరితల జలాశయాలు) నిరుపయోగంగా మారాయి. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని కోడూరు, పుల్లపేట, ఓబులవారిపల్లి, చిట్వేలి, పెనగలూరు మండలాలలోని గ్రామాలలో నిర్మించిన ఈ ట్యాంకులు చాలా వరకు శిథిలావస్థకు చేరాయి. ఈ కారణంగా అడపాదడపా గ్రామాల్లో తాగునీటి ఇక్కట్లను ప్రజలు ఎదుర్కొంటున్నారు. సాధారణంగా ప్రభుత్వం ట్యాంకుల నిర్మాణాన్ని చేపట్టి పంచాయతీలకు అప్పగిస్తుంది. పంచాయతీలే వాటి నిర్వహణను చూడాల్సి ఉంటుంది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నీటిని అందించే బాధ్యత తీసుకుంటారు. కాగా పంచాయతీలకు నిధుల కొరత కారణంగా వీటి నిర్వహణను గాలికి వదిలేశారు. దీంతో బృహత్తర సంకల్పంతో తీసుకువచ్చిన ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్లక్ష్యానికి గురయ్యాయి. తద్వారా గ్రామాల్లో నీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రజలు తాగునీటికి గ్రామాల్లోని పొలాలకు వెళ్లి నీటిని తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నాయి. పలుచోట్ల వీటి ద్వారా వచ్చే నీరు కలుషితం అవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు, ప్రభుత్వం నిర్లిప్తంగా వ్యవహరిస్తుండటంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియని దుస్థితిలో ప్రజానీకం ఉన్నారు. కాగా నియోజకవర్గంలో 5 మండలాలలో మొత్తం 274 ఉపరితల జలాశయాలు ఉండగా వీటిలో 50 శాతం వరకు వృథాగా ఉన్నాయి. అందువల్ల ఏడాదికి ఒకసారి అధికారులు గ్రామాలలో ట్యాంకులను ప్రత్యక్షంగా పరిశీలించి చర్యలు ఇకనైనా చేపడితే బాగుంటుంది.

ట్యాంకులు.. నిరుపయోగం		
కోడూరు	94	25
పుల్లంపేట	31	22
ఓబులవారిపల్లి	48	36
పెనగలూరు	36	19
చిట్వేలి	65	10

పంచాయతీలకు నిధులు కేటాయిస్తే

గ్రామాలకు నీటిని అందించే లక్ష్యంతో నిర్మించిన ఉపరితల జలాశయాల నిర్వహణకు ప్రభుత్వం పంచాయతీలకు అదనపు నిధులు కేటాయించాలని వాదన పంచాయతీల సర్పంచ్‌ల నుంచి వస్తోంది. ప్రస్తుతం ఇస్తున్న గ్రామాల అవసరాలకు వెచ్చించడానికే సరిపోతున్నాయని, సిబ్బందికి జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఇలాంటి తరుణంలో ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్వహణ భారమే అనే వాదన ఉంది. పంచాయతీలకు అదనంగా నిధులు కేటాయిస్తే గ్రామీణులకు సురక్షమైన నీటి అందించే వెసులుబాటు ఉంటుందని పలువురు సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా పైప్‌లైన్‌ల ద్వారా నేరుగా ఇంటికే నీటిని అందిస్తామని ప్రభుత్వాలు చెబుతున్నా కొన్ని గ్రామాల్లో ఇది జరుగుతున్న చాలా గ్రామాల్లో కొళాయి కనెక్షన్ లేదనేది వాస్తవం. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుని వీటి నిర్వహణకు నిధులు కేటాయించి గ్రామీణులకు మంచి నీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.



కూలడానికి సిద్ధంగా ఉన్న రాఘవరాజపురంలోని ఓవర్ హెడ్ ట్యాంకు

విద్యుత్ సమస్య ఉంటే ఇక్కట్లే



ఉపరితల జలాశయాలు వృథాగా ఉండటం వల్ల గ్రామంలో ఒకటి, రెండురోజులు విద్యుత్ సమస్య వస్తే ఇంట్లో నీరు లేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అలాగే వేసవి కాలంలో విద్యుత్‌కోతలు, అధిక నీటి వాడకం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయి. మోటరు చెడిపోతే మహిళలు వ్యవసాయ పంపుల వద్దకు క్యూ కట్టాల్సి వస్తుంది. అధికారులు, ప్రభుత్వం పరిస్థితిపై దృష్టి సారించి వీటిని నిర్వహణను పర్యవేక్షించాలి.

– ప్రతాప్‌రెడ్డి, ఒ.కొత్తపల్లి, రైల్వేకోడూరు

ఉపరితల జలాశయాలను వినియోగించుకోవాలి



గ్రామాలలో వాటర్ ట్యాంకులు ఉపయోగించకపోవడం వల్ల నీటి వృథా, భూగర్భ జలాలు పడిపోతాయి. ముఖ్యంగా 24 గంటలు నిర్లక్ష్యంగా బోరు వేమడం వల్ల సమస్యలు తలెత్తుతాయి. సంబంధిత అధికారులకు, సిబ్బందికి ట్యాంకుల వినియోగంపై తగిన ఆదేశాలు ఇచ్చాం. ప్రజలు నీటి సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే వాటిని పరిష్కరిస్తాం.

– మహేశ్వర్, డీఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్, కోడూరు డివిజన్

కార్మికులకు 'కూటమి' చేసింది శూన్యం



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాంబశివ

రైల్వేకోడూరు అర్బన్ : ఆరు నెలల కాలంలో కూటమి ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలు తప్ప కార్మికులు, పేదలకు చేసింది శూన్యమని, కార్మిక సమస్యలపై ఉద్యమాలు తప్పవని ఆదివారం సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మల రాధాకృష్ణ, సాంబశివ హెచ్చరించారు. స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ ఎన్నికల హామీలను కూటమి నాయకులు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు మరిచారని తెలిపారు. కార్మికుల ఓట్లతో అధికారంలోకి వచ్చి ప్రభుత్వంలో కార్మికుల సమస్యలపై చర్చలేకుండా పరిపాలిస్తున్నారని తెలిపారు. అన్నమయ్య జిల్లాలో చిన్నతరహా, పెద్దపరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని పేర్కొన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమలు ప్రైవేటుపరం చేసే చర్యలు ఆపాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై ఉద్యమాలు చేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, మురళి, జ్యోతిచిన్నయ్య, సరోజమ్మ, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

కరుణించి, కటాక్షించు తల్లీ గంగమ్మా



చిన్నమండెం: భక్తులకు దర్శనమిస్తున్న పాలేటమ్మ



సుండుపల్లె: ప్రత్యేక అలంకారంలో నాగారపమ్మ



సంబేపల్లె: ప్రత్యేక అలంకరణలో నల్లగంగమ్మ

లక్కిరెడ్డిపల్లి : రాయలసీమలోనే ప్రసిద్ధిగాంచిన అనంతపురం గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులు వచ్చారు. భక్తుల రద్దీ కారణంగా ఆలయ అధికారులు క్యూ లైన్‌లో అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు. దర్శనానంతరం భక్తులకు పూజారులు అమ్మవారి బండారు, తీర్థప్రసాదాలను అందజేశారు.

విశేష అలంకరణలో నల్ల గంగమ్మ

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో ఆలయ ప్రాంగణమంతా కిటకిటలాడింది. మొక్కులు ఉన్న భక్తులు అమ్మవారికి పూజలు చేయించి బలులు అర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వచ్చిన భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకుముందు అలయంలో అర్చకులు ఆలయాన్ని వేపాకులతో శుద్ధి చేశారు.

పాలేటమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

చిన్నమండెం : మండల పరిధిలోని కేశాపురం గ్రామం దేవళంపేటలో వెలసిన శ్రీ పాలేటమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో అమ్మవారి మూలవిరాట్ మూర్తిని అర్చకులు పుష్పాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా పలు పూజాది క్రతువులను నిర్వహించారు. మొక్కుబడులు తీరిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. వచ్చిన భక్తాదులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

నాగారపమ్మ ఆలయంలో..

సుండుపల్లె : మండల పరిధిలోని బండకాడ ఈడిగపల్లిలో వెలసిన నాగారపమ్మ భక్తులచే విశేష పూజలందుకుంది. సంతానం ప్రసాదించే కల్పవల్లిగా అమ్మవారు ప్రసిద్ధి. ఆదివారం ఉదయాన్నే పూజారులు అమ్మవారికి పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యాన్ని కల్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని బోనాలు, తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



లక్కిరెడ్డిపల్లె: విశేష పూజలందుకున్న అనంతపురం గంగమ్మ

తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక 'అమరజీవి'

- ఘనంగా పొట్టి శ్రీరాములు వర్ధంతి
- నివాళి అర్పించిన అధికారులు, నాయకులు, ఉపాధ్యాయులు
- ఆయన త్యాగాలను స్మరించుకున్న వక్తలు



రైల్వేకోడూరు అర్బన్: అమరజీవి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



రాజంపేట టౌన్: పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఆకేపాటి



వీరబల్లి: పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

రాజంపేట టౌన్ : తెలుగుభాష మాట్లాడేవారికి ప్రత్యేక రాష్ట్రం ఉండాలని తుదిశ్వాస వరకు పోరాడిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తెలిపారు. కౌన్సిలర్ సనిశెట్టి నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని జౌళీ బజారులో పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆంధ్రరాష్ట్ర సాధనకు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలను సైతం అర్పించిన పొట్టి శ్రీరాములు భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు నాంది పలికారని తెలిపారు. పొట్టి శ్రీరాములు జీవితం తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక అని తెలిపారు. తొలుత జౌళీ బజారులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆకేపాటి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఏల్చూరి అశోక్, సనిశెట్టి నవీన్‌కుమార్, వడ్డే రమణ, పాపినేని విశ్వనాథరెడ్డి, బి.రాజేష్, చక్రి, నరేంద్ర, బింగి హరి, కల్యాణ్, నాగేంద్ర, గూనిపూటి నాని, దోర్నాదుల సురేష్, ఇంద్ర, మధు, రెడ్డిమాసి రమేష్‌నాయుడు, జీవీ సుబ్బరాజు, దండు గోపి, అబ్దుల్ మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి అర్పించిన జిల్లా అదనపు ఎస్పీ

రాయచోటి టౌన్ : ఆంధ్రరాష్ట్ర ప్రజల కోసం తెలుగు వారందరూ ఒక్కటిగా ఉండాలని తపించి ప్రత్యేక రాష్ట్రంగా అవతరణ కోసం తన ప్రాణాలను అర్పించిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని అన్నమయ్యజిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)ఎం.వెంకటాద్రి అన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎం.పెద్దయ్య, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పుల్లంపేట : అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలను ఆదివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓ శ్రీధర్ రెడ్డి ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేశారని, ఆయన కృషితో మనకు ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందన్నారు. ఆయన సేవలను కొనియాడారు.

వీరబల్లి : స్వాతంత్ర్య సమరయోధులు, సంస్కర్త అయిన పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలు అర్పించిన త్యాగధనులని ఉపాధ్యాయులు తెలియజేశారు. ఆదివారం ఆయన వర్ధంతిని వీరబల్లి జెడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రెడ్డయ్య, ఉపాధ్యాయులు, ఆర్య వైశ్య సంఘం నాయకులు పవన్, సురేష్, వెంకటరమణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంబేపల్లె : తెలుగ ప్రజల ఆత్మగౌరవానికి, గొప్పతనానికి ప్రతీక అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు అని సంబేపల్లె జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు.

బెటాలియన్‌లో..

సిద్దవటం : అమరజీవి పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం చేసినటువంటి త్యాగాలు చిరస్మరణీయమని ఏపీఎస్పీ 11వ బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంటు డి.నాగేశ్వరప్ప అన్నారు. సిద్దవటం మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో అసిస్టెంట్ కె.వెంకట్‌రెడ్డి, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేకోడూరు అర్బన్ : యుగపురుషుడు అమరజీవి పొట్టిశ్రీరాములు చేసిన త్యాగాలు నేటికీ మన మందరం అనుభవిస్తున్నామని వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ సీహెచ్ రమేష్, మండల నాగేంద్రలు పేర్కొన్నారు. ఆదివారం పొట్టిశ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎస్‌పీ అబ్దుల్, తస్నీరు ఆంజనేయులు, కరీముల్లా, రమణ, సుధీర్‌రాజు, డీవీ రమణ పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి : మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో ఎంపీడీఓ రెడ్డయ్య, ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ చక్రేనాయక్‌లు అమరజీవి పొట్టి శ్రీరాముల వర్ధంతి సందర్భంగా ఘనంగా ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, సీఆర్‌పీలు రామ్మోహన్, మల్లికార్జున పాల్గొన్నారు.



సంబేపల్లె: నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు



సిద్దవటం మండలం ఏపీఎస్పీ బెటాలియన్‌లో..



రాయచోటి టౌన్: నివాళి అర్పిస్తున్న ఏఎస్పీ

యుద్ధాలతో మానవాళి మనుగడకు ముప్పు



మాట్లాడుతున్న సతీష్‌కుమార్

రాయచోటి అర్బన్ : యుద్ధాలతో మానవాళి మనుగడకు ముప్పు తప్పదని హ్యూమానిటేరియన్స్ ఆర్గనైజేషన్ ఫౌండర్ సతీష్‌కుమార్, ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు బయారెడ్డిలు అన్నారు. ఆదివారం పట్టణంలోని సాయిశుభ కల్యాణ మండపంలో హ్యూమానిటేరియన్స్ ఆఫ్ రాయచోటి సంస్థ ఆధ్వర్యంలో సేవ్ ఎర్త్ – నో వార్ అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలోని చాలా దేశాలు ఆధిపత్య పోరును ప్రోత్సహిస్తూ ఆయుధాలను విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. తమ స్వార్థం, స్వలాభం కోసం దేశాల నడుమ ఉన్న తగాదాలను యుద్ధాలుగా మార్చే క్రమంలో ఆయుధాలను విక్రయిస్తూ మానవాళి మనుగడకు తీరని ముప్పును తీసుకువస్తుండడం దారుణమన్నారు. వీఆర్ విద్యాసంస్థల డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ యుద్ధాలను నివారించి దేశంలో శాంతియుత పరిస్థితులను నెలకొల్పే బాధ్యత ఆయాదేశాల పౌరులపై ఉందన్నారు. మనం నివసిస్తున్న భూమిని కాపాడుకోవడానికి యుద్ధాలను నివారించే బాధ్యతను ప్రతి ఒక్కరూ చేపట్టాలన్నారు. ఉపాధ్యాయ సంఘం నేత శ్రీనివాసరాజు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ వాతావరణ పరిరక్షణ, భూ పరిరక్షణ, యుద్ధాల నివారణ అనే అంశాలపై అవగాహన కలిగించుకోవాలన్నారు. లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 23న రాయచోటి పట్టణంలో సేవ్ ఎర్త్ – నో వార్ అంశంపై నిర్వహించే ర్యాలీలో అన్నివర్గాల ప్రజలంతా పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలంటూ కోరారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ఏడీ సుధాకర్‌రెడ్డి, మానవత, మనం సంస్థల ప్రతినిధులు సహదేవరెడ్డి, ఆనంద్‌రెడ్డితో పాటు పలు విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులకు ఉచితంగా మందులను అందజేస్తున్న ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి, నిర్వాహకులు

రాయచోటి అర్బన్ : ఉచిత వైద్యశిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని రాయచోటి ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి, టీడీపీ నేతలు లక్ష్మిప్రసాద్‌రెడ్డి, సుగవాసి ప్రసాద్‌బాబులు పిలుపునిచ్చారు. పట్టణంలోని బేతల్‌కాలనీలో వెంకటేశ్వర హైస్కూల్‌లో ఎంఏ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో లైఫ్ కేర్, షిఫా ఆసుపత్రుల సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ఎంఏ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో తరచూ పేదల కోసం వైద్య శిబిరాలను నిర్వహిస్తుండడం అభినందనీయం అన్నారు. ప్రజలు ఇలాంటి వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా స్వచ్ఛంద సేవా సంస్థలు ఇలాంటి మరిన్ని శిబిరాలను నిర్వహించేలా ప్రోత్సహించాలంటూ కోరారు. ఎంఏ వెల్ఫేర్ సొసైటీ భవిష్యత్తులో నిర్వహించే వైద్యశిబిరాలకు తమవంతు సహాయ, సహకారాలను అందజేస్తామంటూ చెప్పారు. ప్రముఖ వైద్యులు జుబేర్ అహమ్మద్, యుగంధర్ రెడ్డి, ఉదయ్ శివారెడ్డిలు శిబిరానికి వచ్చిన రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కాగా వైద్య పరీక్షల నిమ్మితం శిబిరానికి పెద్దసంఖ్యలో స్థానికులు హాజరయ్యారు. కార్యక్రమంలో లైఫ్ కేర్ ఆసుపత్రి వైద్యుడు జక్రియా అహమ్మద్, ఎంఏ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు నహవీల్‌బాషా, సభ్యులు, వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

పెనగలూరు : రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ట్రైనర్ సిద్దయ్య, యూనిట్ ఇన్‌చార్జ్ లక్ష్మీదేవిలు అన్నారు. మండల కేంద్రమైన పెనగలూరు పంచాయతీ కొత్తపల్లి గ్రామానికి చెందిన వీరాపల్లి చిన్నపరెడ్డి ప్రధాన మామిడి తోటలలో అంతర పంటలు వేయడంతో ఒక్కడికి తీసుకెళ్లి డ్వాక్రా సంఘం సభ్యులకు, రైతులకు సిబ్బంది పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. చిన్నపరెడ్డి అంతర పంటలు సాగు చేయడంతో ఆయన పొలం వద్ద 400 లీటర్ల జీవామృతాన్ని తయారు చేశారు. ఈ జీవామృత్నాని భూమిలో వేస్తే నిద్రావస్థలో ఉన్న సూక్ష్మజీవులలో కదలిక వచ్చి పంటలకు మంచి పోషకాలు అందిస్తాయని తెలిపారు. అంతర పంటలతో మంచి ఆదాయం వస్తుందని వారికి సూచించారు.

ద్రవ జీవామృతం పంటకు జీవనాధారం

రైల్వేకోడూరు అర్బన్ : ద్రవ జీవామృతం పంటకు జీవనాధారమని రైతులు జీవామృతం వినియోగాన్ని పెంచాలని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్ సుబ్బరాయుడు ఆదివారం తెలిపారు. మండలంలోని ఉర్లగడ్డపోడులో రైతులకు ద్రవ జీవామృతం తయారీలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటలు వేసే ముందు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. తరువాత చీడపీడల నివారణ, అధిక దిగుబడి రావడానికి జీవామృతం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

సిద్దవటం : రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు సిద్దవటం పోలీసులు ఆదివారం బద్వేల్ – కడప ప్రధాన రహదారి, పోలీసు లైన్ మలుపు వరకు రోడ్డుకు ఇరువైపుల కంప చెట్లను చెత్తకుప్పలను తొలగించే చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రమణ, పోలీసులు శివ, రామకుమార్ పాల్గొన్నారు.



దోజర్ సహాయంతో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న పోలీసులు

చిన్నారుల సందడి

కడప కల్చరల్: శిల్పారామంలోని సాంస్కృతిక వేదికపై ఆదివారం చిన్నారులు తమ ఆట పాటలతో సందడి చేశారు. పులివెందులకు చెందిన ఎస్‌కే డ్యాన్స్ అకాడమీ చిన్నారులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలు చేశారు. ప్రేక్షకులను నృత్యాలు అలరించాయి.